
బాబోయ్ దోమలు



- 30వ డివిజన్‌లో ఖాళీ స్థలాలు అధికం
- మురుగు పోయే దారే లేదు
- దోమల విజృంభణ
- తూతూమంత్రంగా చర్యలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దోమల బాధతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 30వ డివిజన్ దేవీనగర్, రామకృష్ణాపురం, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో ఏడాది పొడవునా దోమలు విజృంభిస్తున్నాయి. ఈ ప్రాంతంలో బుడమేరు, రైల్వే ఖాళీ స్థలాలు, ప్రైవేటు ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ మురుగునీరు బయటకు పోయే దారి లేక వర్షం నీరు, వాడిన మురుగు నిలిచిపోయి దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారాయి. ఇక్కడ దోమల నివారణ చర్యలు కూడా తూతూమంత్రంగానే జరుగుతున్నాయి. సంపాదనలో అధిక భాగం దోమల నియంత్రణకే సరిపోతోందని స్థానికులు వాపోతున్నారు. ఏడాది పొడవునా దోమలు చెండుకు తింటున్నాయని దీంతో రాత్రిపూట కంటి నిండా నిద్రకూడా కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలతో తరచూ వ్యాధుల బారిన పడాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు.

కానరాని ఫాగింగ్

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో అప్పుడప్పుడు మురుగునీటిలో ఆయిల్ బాల్స్, తాజానీటి గుంతల్లో గంబూసియా చేపలు వేస్తున్నారు. అప్పుడప్పుడు బుడమేరులో డ్రోన్‌ల ద్వారా ఎంఎల్‌ఆయిల్ స్ప్రే చేస్తున్నారు. కానీ ఇవేమీ దోమల నుంచి కాపాడలేకపోతున్నాయి.



దావు బుచ్చయ్యకాలనీలో ఖాళీ స్థలం

ఫాగింగ్ మాత్రం కానరావడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

మురుగు పోయే దారేదీ

ఇక్కడ ఎక్కడికక్కడ ఖాళీస్థలాల్లో మురుగు, వర్షం నీరు నిలిచిపోయి దోమలు పెరిగిపోతున్నాయి. దోమలకు ఆవాస కేంద్రంగా మారిన ఖాళీ స్థలాలను మెరక చేయించడంలో అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికే సచివాలయం ద్వారా ప్రతి ఇల్లు మ్యాపింగ్ అయిన దృష్ట్యా అధికారులు ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి మెరక చేయించడంతో పాటు వాడిన మురుగు నీరు బయటకు పోవడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వినాయకనగర్‌లో



ఖాళీ స్థలాల్లో పెరిగిన జమ్ము

కంటిపై కునుకు కరువు



దోమల వల్ల రాత్రిపూట కంటి నిండా నిద్ర కూడా కరువైంది. సాయంత్రమయ్యేసరికి దోమల దండయాత్ర ప్రారంభమవుతుంది. కనీసం ఇంటి ముందు ముగ్గు కూడా వేయలేకపోతున్నాం.

– కె చంద్రకళ, దావు బుచ్చయ్యకాలనీ

సర్పాల సంచారం

ఖాళీ స్థలాలు, మురుగు, జమ్ము పెరిగిపోవటంతో ఇక్కడ సర్పాల సంచారం అధికమైంది. దీంతో రాత్రిపూట బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. పాములు తిరుగుతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుదోనంటూ స్థానికులు బెంబేలెత్తి పోతున్నారు.

క్లుప్తంగా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఎన్‌పురం ఎస్ఐ షబ్బీర్ హెచ్చరించారు. ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ బాల రాజాజీ ఆదేశాల మేరకు ఆదివారం స్టేషన్ ఆవరణలో ఎస్ఐ షబ్బీర్ పీఎస్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరచరిత్ర కలిగిన ప్రతి ఒక్కరిపై పోలీసుల నిఘా ఉంటుందని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తన కలిగి కుటుంబసభ్యులతో సంతోషంగా ఉండాలని సూచించారు.

మృదంగ విద్వాంసుడికి స్మారక పురస్కారం



విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ చింతారవి బాలకృష్ణ బృందం మోహినీ భస్మాసుర నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. మృదంగ విద్వాంసుడు విజయసారథికి 2024 సంవత్సరానికి శీరం సుబ్రహ్మణ్యం స్మారక పురస్కారం ప్రదానం చేశారు. సుమధుర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి పసుమర్తి భాస్కరశర్మ.. విజయసారథి సంగీత సేవలను వివరించారు. కార్యక్రమంలో అంబటి మధుమోహన కృష్ణ, నాట్యాచార్యులు చింతా రవిబాల కృష్ణ, పద్మశ్రీ హేమంత్, సంస్థ సభ్యులు బొర్రానరేన్ దృశ్యవేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నయనానందకరం భోగశ్రీనివాసుని సంప్రోక్షణ



విజయవాడ కల్చరల్: టీటీడీ ఆధ్వర్యాన పున్నమ్మతోటలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భోగ శ్రీనివాసుని సంప్రోక్షణ కార్యక్రమాలు ఆదివారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ పండితులు నల్లూరి వెంకట మోహన రంగాచార్యులు, కామకన భట్టార్, కుమారాచార్యులు వైదిక క్రతువును నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమాదేవి పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సద్గురు సంగీత సభ సేవలు ఆదర్శం



విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీతసభ సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి అన్నారు. శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించే 31వ జాతీయ వార్షిక సంగీత మహోత్సవాలు దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలను ప్రారంభించిన కృష్ణవేణి మాట్లాడుతూ 31 ఏళ్లుగా నిరంతరం సంగీత సేవలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్, గాత్ర సంగీత విద్వాంసురాలు గాయత్రీ గౌరీనాథ్, ముండుంబై శారదా దీప్తి పాల్గొన్నారు. తొలిరోజు లతాంగి సోదరీమణులు అర్చన, సమన్వి పలు సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కల్యాణరామన్, ఘటంపై రామకృష్ణ సహకరించారు.

వీఎంసీ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదులు-పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే.. ప్రజా ఫిర్యాదులు పరిష్కార కార్యక్రమాన్ని సోమవారం చిట్టి నగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్-1 కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తానని, సత్యనారాయణపురంలోని సర్కిల్-2లో, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంతోపాటు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో కూడా కార్యక్రమం జరుగుతుందని వివరించారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్టీసీ విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ ఎంజీ రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 25వ తేదీ సోమవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్ స్టేషన్ ఏరియా, కంట్రోల్ రూమ్ ఏరియా, పట్టాభిరామయ్య వీధి, పాటిబండ్లవారి వీధి, ఆంజనేయ స్వామిగుడి వీధి, పొట్టిస్వామి వీధి, తానియా హోటల్ ఏరియా, పట్టాభి రామయ్య వీధి, మందపాటి వారి వీధి, టైర్ భవన్ రోడ్డు, బందర్ లాకుల ఏరియా, విజయకృష్ణ సూపర్‌బజార్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట సబ్ స్టేషన్‌లోని సూర్యారావుపేట సెక్షన్‌లో 11 కేవీ విద్యుత్ లైన్‌ల నిర్వహణ పనుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహణ ఇంజినీర్ పి.రవీంద్రబాబు ఒక ప్రకటలో తెలిపారు. చుట్టుగుంట సిగ్నల్ ప్రాంతం, పాత ఏడవ టౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్, మాసల వీరన్నవీధి, మారుతీ నగర్ ఏలూరురోడ్డు కొండ ప్రాంతం, కోకాకోల వీధి, మేయర్ వీధి, ఎం.ఎస్.ఆర్ వీధి, కాకతీయ కాలేజ్ రోడ్, భగత్ సింగ్ రోడ్, వెంకటస్వామి వీధి, మొయిన్ అలీ బేగ్ స్ట్రీట్, మాచవరం మసీదు స్ట్రీట్, జమిందారు వీధి, సుంకరవారి వీధి, లలితమ్మ వీధి, మారుతీ నగర్, మాచవరం కొండ ప్రాంతంలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

అదానీ అక్రమాలపై దర్యాప్తు చేయాలి

పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనసూయ



సమావేశంలో మాట్లాడుతున్న అనసూయ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదాని అవినీతి, కుంభకోణాలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపించాలని, అదాని కంపెనీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అనసూయ.. మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ప్రగతిశీల మహిళా సంఘం (సీఓడబ్ల్యూ) నగర జనరల్ కౌన్సిల్ జరిగింది. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అదాని, అంబానీ వంటి కార్పొరేట్ వ్యక్తుల పాదసేవలో మునిగి తేలుతోందని విమర్శించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విజయ మాట్లాడుతూ మోదీ ఏలుబడిలో దేశంలో ప్రతిరోజూ 88 మంది మహిళలపై అత్యాచారాలు జరగడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం మహిళలకు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విజయవాడ నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర కోశాధికారి ఎస్.కె. రజియా, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ 'సెంట్రల్' సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో ఆదివారం యూనియన్ నాయకులు మల్లాది విష్ణుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రారంభించిన 108 ఉచిత అంబులెన్స్ సర్వీసులు నేడు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు విస్తరించాయని మల్లాది విష్ణు వెల్లడించారు. ప్రజలకు 24 గంటలు అత్యవసర వైద్యసేవలు అందించటం, సకాలంలో ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడటంలో సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. అటువంటి ఉద్యోగులు ఆత్మాభిమానంతో బాధ్యతలు నిర్వర్తించడానికి వారి న్యాయబద్ధమైన హక్కులను సాధించాల్సిన అవసరం ఉందన్నారు. సిబ్బంది గ్రాట్యూటీ, ఎర్న్ లీవ్స్ డబ్బులు చెల్లించటంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా వారిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగ సంఘాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వారికి తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో అన్న ప్రసాద వితరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో భక్తులకు నిత్యాన్నదానం జరుగుతుంది. కార్తికమాసం, ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, సాయంత్రం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో నిత్యాన్నదానం చేస్తారు. శుక్ర, ఆదివారాల్లో రోజుకు 8 వేలు, సోమవారం నుంచి గురువారం వరకు 6 వేల మందికి అన్న ప్రసాద వితరణ ఉంటుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహామండపం రెండో అంతస్తులో భక్తులు కూర్చుని తినే విధానంలో, మొదటి అంతస్తులో బఫే పద్ధతిలో అన్న ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇక సాయంత్రం 7.30 గంటల నుంచి రాజగోపురం ఎదుట వెయ్యి మంది, శుక్రవారం , ఆదివారం 1500 మందికి అన్న ప్రసాద వితరణ చేస్తున్నారు. శుక్రవారం, శనివారం, ఆదివారాలలో రద్దీ అధికంగా ఉండటంతో అన్నప్రసాద వితరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులందరూ అన్నప్రసాదం స్వీకరించేందుకు, ఎక్కువ సమయం క్యూలైన్‌లో వేచి ఉండకుండా ఉండేందుకు బఫే పద్ధతిని ప్రవేశ పెట్టామని తెలిపారు. ఇక కార్తి మాసాన్ని పురస్కరించుకుని సోమవారాలతో పాటు విశేష పర్వదినాల్లో రోజుకు 2500 మందికి మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం సంధ్యా సమయంలో అన్న ప్రసాద వితరణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రావిచెట్టు సెంటర్‌లో లక్ష దీపోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కార్తిక మాసం సందర్భంగా ఆదివారం మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో విశ్వహిందూ పరిషత్ మహానగర్, నారాయణీ సేన ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం జరిగింది. శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి కార్తికమాసం విశిష్టతను, ఈ మాసంలో దీపాలు వెలిగించడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. నిర్వాహకుడు పిట్టల గోవిందు మాట్లాడుతూ ఆవు పేడతో చేసిన ప్రమిదలతో ఈ ఏడాది లక్ష దీపోత్సవం నిర్వహించామన్నారు. బీజేపీ నేతలతో పాటు వీహెచ్‌పీ, నారాయణీ సేన సభ్యులు, అయ్యప్పలు, భవానీలు భజనలు చేశారు. శివలింగం, త్రిశూలం ఆకారంలో మహిళా భక్తులు దీపాలను వెలిగించి పూజలు చేశారు. రావిచెట్టు సెంటర్ నుంచి శివాలయం వరకు కార్తిక దీపాల వెలుగులు విరజిమ్మాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని పూజలు చేశారు.

సమ్మోహనం.. కూచిపూడి నృత్యం





విజయవాడ కల్చరల్: జేఎంఎస్ యోగభారతి అకాడమీ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ నెల నెలా నాట్యవేదం కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. నాట్యాచార్యులు జంగం మనీషా చక్రవర్తి, జంగం శిరీషా చక్రవర్తి ఆధ్వర్యంలో పూర్వరంగం, బ్రహ్మాంజలి, సందెకాడ పుట్టినట్టి, బృందావనం, గోవర్ధనగిరిధారి, జావళి, బృందావన నిలయేరాదే, కృష్ణ శబ్దం, అంజనీ సుతుడు, పంతుము లాడెదమా అంశాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథి డాక్టర్ గుమ్మా సాంబశివ రావు మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యానికి పూర్వవైభవం తీసుకురావడానికి యువ నాట్యాచారిణిలు జంగం శిరీషా చక్రవర్తి, మనీషా చక్రవర్తి కృషి చేస్తున్నారని తెలిపారు. జేఎంఎస్ యోగభారతి నిర్వాహకులు జంగం విజయకుమార్, చక్రవర్తి, కళాపోషకుడు గోళ్ల నారాయణరావు, ఎం శ్రీనివాసకుమార్, రామ్మోహనరావు పాల్గొన్నారు. చిన్నారులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.

● కార్తిక వనభోజనాల సందడి



కార్తిక వనభోజనాలతో నగరంలోని భవానీద్వీపం ఆదివారం సందడిగా మారింది. బోటులో ద్వీపానికి వస్తూ ప్రకృతి అందాలను వారి సెల్ కెమెరాల్లో బంధించారు. పిన్న, పెద్ద కుటుంబ సమేతంగా తరలిరావడంతో ద్వీపం కోలాహలంగా కనిపించింది. పిల్లలు, పెద్దలు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. మధ్యాహ్నం వనభోజనాలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నగరంలోని పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఫల పుష్ప ప్రదర్శన మొక్కల ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లలో బొన్సాయ్ మొక్కలతో పాటు ఇండోర్, అవుట్ డోర్‌లో పెంచుకునే మొక్కలు, గార్డెనింగ్ మెటీరియల్స్ లభ్యమవుతున్నాయి. ప్రకృతి సేద్యం, మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా స్టాల్స్ కూడా ఏర్పాటు చేశారు. నగరవాసులకు కావాల్సిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను తక్కువ ఖర్చుతో రసాయనాలు ఉపయోగించకుండా వంటగదిలో ఉత్పత్తయ్యే వ్యర్థాలతో పండించుకునే విధానాలపై స్టాల్స్‌లో అవగాహన కల్పిస్తున్నట్టు సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ సంఘం విజయవాడ ప్రతినిధి పీవీడీ నాగేశ్వరరావు తెలిపారు.

నున్న, జక్కంపూడిలో 'కార్తిక' కోలాహలం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసం సందర్భంగా నిర్వహించే వనసమారాధన కార్యక్రమాలు నున్న, జక్కంపూడి ప్రాంతాల్లో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. పలు కుల సంఘాలు, పలు పార్టీలు, అసోసియేషన్‌లు, కాలనీల ఆధ్వర్యంలో ఇక్కడి మామిడి తోటల్లో వేర్వేరుగా వన భోజనాలను జరిపారు. యువత సందడి చేశారు. వైఎస్సార్ సీపీ 63వ డివిజన్ ఆధ్వర్యంలో నున్న తోటల్లో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. పసుపులేటి యేసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డెప్యూటి మేయర్ అవుతు శ్రీ శైలజ ఇతర నేతలు పాల్గొన్నారు. నాగవంశం రాష్ట్ర నేతల ఎరుబోతు రమణారావు ఆధ్వర్యంలో జక్కంపూడి మామిడి తోటల్లో వన సమారాధన జరిగింది. కనకారావు, రామారావు తదితరులు పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి జేసీహెచ్ కొండారెడ్డి ఆదివారం 'తూర్పు'లో కృష్ణలంకలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బూత్‌లో ఉండే సౌకర్యాలు, ప్రత్యేక ఓటరు నమోదును పరిశీలించిన అక్కడ వసతులపై సంతృప్తిని వ్యక్త పరిచారు. కార్యక్రమంలో పలువురు వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సనాతన ధర్మరక్షణకు హిందువులు కట్టుబడి ఉండాలి



విజయవాడ కల్చరల్: సనాతన ధర్మరక్షణకు హిందువులు కట్టుబడి ఉండాలని ధర్మప్రచారకులు రాధామోనోహర దాస్ స్వామిజీ అన్నారు. శత సహస్ర దీపార్చనా మండలి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే కార్తిక మాసోత్సవాలు సత్యనారాయణపురం శిశువిద్యామందిర్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. 26వ తేదీ మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు.